క్లుప్తంగా

నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ కె.లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్పందనలో పాల్గొనే అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో కూడా స్పందన జరుగుతుందని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు.

వాసవి కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: చోడవరంలోని శ్రీలక్ష్మీనారాయణ సహిత శ్రీనాగేంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పలు పూజా కార్యక్రమాలు, వనసమారాధన జరిగింది. తొలుత శ్రీకన్యకాపరమేశ్వకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. నాగేంద్రస్వామివారి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. ఉసిరి చెట్టు కింద దీపారాధన చేశారు. అనంతరం వన సమారాధన జరిగింది. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓబులశెట్టి, రామాంజనేయులు, గౌరవ అధ్యక్షుడు కొండవీటి బాబూరావు, సభ్యులు బొమ్మిశెట్టి మల్లికార్జునరావు, చక్కా లక్ష్మణరాయుడు, ఇనుగూరి సుబ్రహ్మణ్యం, కొప్పవరపు సూర్యనారాయణ, నేరెళ్ల తులసీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

120 మందికి ఉచిత వైద్యసేవలు



కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు ఎంబీ ఎంఆర్ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టాప్‌స్టార్స్ హాస్పిటల్స్ సౌజన్యంతో లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటుచేశారు. దీన్ని మాజీ ఎంపీపీ దేవినేని రాజా ప్రారంభించారు. దీనిలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. లయన్స్ ప్రతినిధి రావి సురేష్‌బాబు పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన శిబిరంలో సర్పంచ్ పి.ఇందిర, పర్వతనేని రామకృష్ణారావు, రావి సత్యనారాయణ, ఆలపాటి వెంకటేశ్వరరావు, గోరంట్ల కృష్ణారావు, దేవినేని బోసు, గద్దె శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వంశీ పరామర్శ

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనారోగ్యానికి గురైన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదివారం పరామర్శించారు. బాపులపాడు మండలం బండారుగూడెంకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు పామర్తి సత్యనారాయణ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆయన నివాసానికి ఎమ్మెల్యే వంశీ విచ్చేశారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న బాపులపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొల్లి వెంకట్రావును ఎమ్మెల్యే వంశీ పరామర్శించారు. కృష్ణానగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఎఫ్‌సీఐ గోడౌన్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకుడు దేవిశెట్టి శంకరరావు తల్లిని వంశీ పలకరించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఉంగుటూరు: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో జీవీఎస్వీ శేషగిరిరావు అన్నారు. ఉంగుటూరు, ఆముదాలపల్లిలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అమీర్‌బాషా, నర్రా ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నారులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

పామర్రు: చిన్నారులకు చదువుతో పాటుగా సంస్కారం, ఆచారాలు, సంప్రదాయాలను కూడా నేర్పించాలని ఉమ్మడి కృష్ణా జిల్లా సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ ఆళ్ల జయశంకర్ అన్నారు. స్థానిక హితమ్ పబ్లిక్ స్కూల్‌లో సమరసత సేవ ఫౌండేషన్ బాల వికాస్ పాఠశాలల ఉపాధ్యాయులు, చిన్నారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ ఫౌండేషన్ ద్వారా బాల వికాస్ పాఠశాలలను నిర్వహించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారుజ

కమ్మేసిన పొగమంచు

పొగ మంచు కమ్మేసింది. తీవ్రమైన చలి గాలితో పాటుగా మంచు వానలా కురిసింది. ఇక్కడి పరిసరాల్లోని రహదారులు, ఇళ్లు, పంట పొలాలపై ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకూ పొగమంచు కమ్మేసింది. తెల్లవారినా మంచు తెరలు వీడక పోవటంతో వాహనదారులు తమ వాహనాలకు ఉన్న లైట్లు వెలిగించి రాకపోకలు సాగించాల్సి వచ్చింది. కంకిపాడు పరిసరాల్లో మంచుతెరలు కమ్మిన దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది. -కంకిపాడు



ఈడుపుగల్లు రోడ్డు మార్గంలో పొగమంచు కమ్మిన దృశ్యం



గోసాల సెంటరులో రోడ్డును కమ్మిన మంచు తెరలు



కంకిపాడులో వరి పొలంపై పొగమంచు

ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోండి

ఆటోనగర్(విజయవాడతూర్పు): తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ప్రమాద బీమాను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియా పోస్ట్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కె.వి.అనుదీప్ కోరారు. ఆటోనగర్ పంటకాలువ సెంటర్ వద్ద ఆదివారం ప్రమాద బీమా నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. తపాలా శాఖ వినూత్న పథకం తీసుకువచ్చిందన్నారు. 18 నుంచి 65 ఏళ్లలోపు వారు పథకానికి అర్హులని తెలిపారు. ఈ బీమాను గతేడాది పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిందన్నారు. ఏడాదికి రూ.525లు చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు విజయవాడ బ్రాంచ్‌లో 16 వేలు ప్రమాద బీమా పాలసీలు చేశామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 52 డెత్ క్లెయిమ్స్ నమోదయ్యాయని ఇందుగాను వీరి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చొప్పున రూ.5.20 కోట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఏసీపీ దేవానంద్, పోస్టల్ మేనేజర్ వంశీధర్ బాబు, ఐలా మాజీ చైర్మన్ ఎస్.సుంకర దుర్గాప్రసాద్, డాక్టర్ అబ్దుల్ కలాం, వివిధ సంఘాల అధ్యక్షులు, కార్మికులు పాల్గొన్నారు.



కార్తిక ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని కొండేశ్వర స్వామి దేవస్థానం, షిర్డీ సాయిబాబా ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో భక్తులు సహస్ర దీపాలంకరణ కనులపండువగా జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకుడు కోడెబోయిన బాబి, ఆలయ కమిటీ సభ్యులు రావి ఈశ్వర్, లంక బేబి, పద్మశ్రీ, తుమ్మల భాను పాల్గొన్నారు. వీరవల్లిలోని కొండేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం, సామూహిక సహస్రనామ కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు.

విరాళాల వివరాలు తెలపండి

బాపులపాడు సీఎస్ఐ చర్చి సంఘస్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ప్యారిస్ పరిశుద్ధ సీయోన్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రార్థనా సమయంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. చర్చి పునర్నిర్మాణం కోసం దాతల నుంచి సేకరించిన విరాళాలపై క్షుణ్ణంగా వివరాలు తెలియజేయాలని సంఘ సభ్యుడు దయాల రాజేశ్వరరావును సంఘస్తులు నిలదీశారు. దీంతో చర్చిలో తీవ్ర గందరగోళ పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ వారికి సర్ది చెప్పడానికి యత్నించారు. అయితే విరాళాల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని సంఘస్తులు పట్టుబడటంతో, వాటిని వెల్లడించడానికి రాజేశ్వరరావుకు గడువు ఇచ్చారు.

ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు సభ్యులంతా కృషి చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. సింగ్ నగర్‌లో ఏఎంసీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ ప్రజల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం సోదరులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం లభిస్తోందని పేర్కొన్నారు. అనంతరం 59వ డివిజన్ ఏఎంసీ అధ్యక్షుడిగా షేక్ సలీం భాష, పశ్చిమ నియోజకవర్గంలోని 55వ డివిజన్ అధ్యక్షుడిగా ఎండీ షఫీఅహ్మద్‌ను ఎంపిక చేసి, వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ నాయకులు హఫీజ్, షేక్ సాజిద్‌అలీ, సయ్యద్‌మౌలాలి, షేక్ మస్తాన్, మునీర్‌అహ్మద్ ,అబ్దుల్‌రహీం, మహమ్మద్ రఫీ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

19 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో నూతన వైనతేయ మండపం, ధ్వజస్తంభ త్రయాహ్నిక ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. స్థానిక మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తలు, ప్రత్యేక ఆహ్వానితులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ 19 నుంచి 22వ తేదీ వరకు వేదపండితుల మంత్రోచ్చారణలతో ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవాలు జరుగుతాయన్నారు. 22న అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.

సోమేశ్వరునికి లక్ష బిల్వార్చన


పామర్రు: సోమేశ్వరస్వామి లక్ష బిల్వార్చన కార్యక్రమం భక్తులను అలరించింది. స్థానిక గంగా పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పామర్రు బ్రాహ్మణ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో లక్ష మారేడు దళాలతో బిల్వార్చన కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత స్వామికి నమక చమకాలతో ఏకాదశి రుద్రాభిషేకాలను పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామికి విశేషంగా అన్నాభిషేకాలను నిర్వహించారు. పామర్రు బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు భేతనబొట్ల సుబ్బారావు, ఆర్గనైజర్ బేతనబొట్ల ఫణి కిషోర్‌శర్మల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక పార్వతీ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమం జరిగింది. తదుపరి నీరాజన మంత్ర పుష్పాలను ఇచ్చి భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం స్థానిక చావలి వెంకటేశ్వరరావు గృహం వద్ద కార్తిక సమారాధన ధాత్రి పూజలను నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. సమితి సభ్యులు గడియారం బాలగంగాధర శర్మ, బేతనబొట్ల చంద్రశేఖర్‌రావు, ఘడియారం సుబ్రమణ్య శాస్త్రి, లంకా భీష్మకుమార్, లంక చైతన్య ప్రభు, ఆర్.కాశీ విశాలక్ష్మీ, పి.గిరిజ, ఎల్.పద్మలత, బి.కనకదుర్గ, జీ కామేశ్వరి పాల్గొన్నారు.



పామర్రులో సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

సాగర తీరంలో పర్యాటకుల సందడి

కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. శని, ఆదివారాలు వరుస సెలవులతో పాటు కార్తికమాసం కూడా కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాలకాయతిప్ప బీచ్ వద్ద పర్యాటకులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు తీరంలోనే సైకత శివలింగాలు సిద్ధం చేసి కార్తిక దీపాలు వెలిగించారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సందడి చేశారు. సాగర సంగమం వద్ద పరిస్థితులు అనుకూలించకపోవడంతో అక్కడకు పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరం వెంట ముమ్మర గస్తీ నిర్వహించారు.



భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆదివారం జరిగాయి. ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక మాసంలో సామూహిక సత్యనారాయణ వ్రతాల విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అద్దంకి సత్యనారాయణప్రసాద్, ఉప్పులూరి శేషప్రసాద్‌శర్మ పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి మందిరంలో..

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ ఆదివారం జరిగింది. అయ్యప్పలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. సుమారు 400 మంది అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్తిక మాసం పూర్తయ్యే వరకు అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు తెలిపారు.



సత్యవ్రతంలో భక్తులు

కనుల పండువగా మల్లేశ్వరస్వామి కల్యాణం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం స్వామి వారికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిగాయి. ఉదయం 11 గంటలకు వేద మంత్రాల మధ్య స్వామివార్లకు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపోత్సవం, నీరాజన మంత్ర పుష్పాలతో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కాంక్రీట్ మిల్లర్ చోరీ

పెనమలూరు: కాంక్రీట్ పనులకు ఉపయోగించే మిల్లర్ చోరీ జరగటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రాజీవ్‌నగర్‌కు చెందిన ఒర్సు గోపి కాంక్రీట్ పనులు చేస్తాడు. అతను కొద్ది రోజుల క్రితం కానూరు మురళీనగర్ బల్లెంవారివీధిలో కాంక్రీట్ పనులకు మిల్లర్ తీసుకువచ్చాడు. పనులు ముగిసిన తరువాత మిల్లర్ ఇక్కడే ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని చోరీ చేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వరకట్నం వేధింపులపై కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు మహిళా మండలి కాలువ కట్టకు చెందిన మానేపల్లి కల్యాణికి గత ఏడాది ఫిబ్రవరిలో మచిలీపట్నానికి చెందిన మానేపల్లి అశోక్‌తో పెద్దల సమక్షంలో వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. కాపురానికి పంపిన సమయంలో సారె కూడా పెట్టారు. భర్త రియల్ ఎస్టేట్ వ్యాపారి. వీరికి కుమార్తె ఉంది. భర్తకు దురలవాట్లు ఉన్నాయి. దీంతో అతను ఇచ్చిన కట్నం చాల లేదని అదనంగా తీసుకురావాలని భార్య కల్యాణిని వేధిస్తున్నాడు. భర్తతో పాటు అత్త పద్మ, మామ వెంకటేశ్వరరావు వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చెప్పారు. పోరంకి గ్రామంలో ఆదివారం నాయీబ్రాహ్మణ వన సమారాధనతో పాటు భగవాన్ ధన్వంతరి జయంతి ఉత్సవాలు ఘనంగా చేశారు. పోరంకి లక్ష్మీనరసింహగార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడిగా మల్కాపురం కనకారావు, అధికారులు బి.రామారావు, కేవీ మోహన్‌రావు, రవీంద్రనాథ్‌బాబు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య, సంఘ సభ్యులు మురళీకృష్ణప్రసాద్, ఉమామహేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, వణుకూరు సురేష్‌బాబు, రమణ, నాయీబ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నాయీబ్రాహ్మణ వన సమారాధనలో ఎమ్మెల్యే పార్థసారథి

ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి

గన్నవరం: స్థానిక చింతలపేటలోని చర్చ్ ఆఫ్ ది లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ మందిరంలో ఆదివారం స్మైల్ అండ్ షైన్, గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కె. సంపత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఎన్. శ్రావ్యచందన నేతృత్వంలో సంఘ సభ్యులకు దంత వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా టూత్ పేస్టులు, మందులు పంపిణీ చేశారు. అనంతరం దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి పాస్టర్ ఎన్. జోసఫ్‌రాజు మాట్లాడుతూ...క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని చెప్పారు. నిత్య వ్యాయామం, యోగ, ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్ సూచించారు. సంఘ పెద్దలు దేవరపల్లి విక్టర్‌బాబు, లాజరు, పులి శ్రీనివాసరావు, అశోక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



దంత వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

అంబాపురం(విజయవాడరూరల్): ఏసుక్రీస్తు పుట్టుక సర్వమానవాళి కోసమేనని కృష్ణా, గోదావరి డయాసిస్ సీఎస్ఐ బిషప్ కోర్నేల్‌ఏసు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి అంబాపురం గ్రామం సీఏస్ఐ చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీ హౌసింగ్ నోడల్ అధికారి కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ సెమీక్రిస్మస్ జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జోగా మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, మాజీ సర్పంచి తోడేటి విజయకుమార్ పాల్గొన్నారు.



సెమీక్రిస్మస్ వేడుకల్లో బిషప్ కోర్నేల్ యేసు తదితరులు

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఒకరికొకరు సాయం చేసుకుంటూ కుటుంబం, తద్వారా సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏపీ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి అన్నారు. హనుమాన్‌జంక్షన్ శివారులోని దుట్టా కృష్ణమూర్తి బృందావన్ గార్డెన్స్‌లో అడపా వారి కార్తిక మాస వన సమారాధన, ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి అడపా కుటుంబ సభ్యులు తరలివచ్చారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన అడపా శేషగిరి మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరూ ఐకమత్యంగా ఉంటూ విద్య, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాగించాలని ఆకాంక్షించారు. దీనికి తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ సలహాదారుడు అడపా నాగ దుర్గారావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అడపా కుటుంబ సభ్యులందరిని ఒకే వేదిక మీదకు చేర్చి, ఆపన్నులకు సహాయం అందించటం అభినందనీయమన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు శేరినరసన్నపాలెం సర్పంచ్ అడపా అంజిబాబు, ఆయన సోదరులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, ప్రకాశం జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, సీఐ అడపా సతీష్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషును సత్కరిస్తున్న డాక్టర్ దుట్టా, అడపా కుటుంబీకులు

ఆటో, కారు ఢీ

- ఇద్దరికి గాయాలు
- విజయవాడ,మచిలీపట్నం జాతీయ రహదారిపై ఘటన

కంకిపాడు: ఆటో, కారు ఒకదాన్నొకటి ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న సంఘటన విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల మేరకు విద్యుత్ శాఖ ఉయ్యూరు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా చేస్తున్న ఎం.వెంకట విజయ రామకృష్ణ కారులో తన భార్య రజనీకుమారి, పాప జాస్మిన్‌తోకలసి మంటాడలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్తున్నారు. కొణతనపాడు అడ్డరోడ్డు సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో, కారు ఒకదాన్నొకటి ఢీ కొన్నాయి. ఘటనలో కారు ఇంజిన్ భాగం, ఆటో పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ ఆటో డ్రైవరును విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న రజనీకుమారికి తీవ్ర గాయాలు కావటంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందు భాగం

నేరప్రవృత్తి మానుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రౌడీషీటర్లు, నేరస్తులు నేరప్రవృత్తి మానుకోవాలని గుణదల సీఐ పీ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక గుణదల పోలీస్ స్టేషన్‌లో నేరస్తులు, రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుల ప్రతి కదలికను పోలీసులు గమనిస్తుంటారని, ఏ చిన్న నేరం చేసినా పోలీసుల నుంచి తప్పించుకోలేరని చెప్పారు. ఎక్కడైనా నేరం జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నేరస్తుల తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరం చేసే ముందు కుటుంబ సభ్యులను గుర్తు తెచ్చుకోవాలన్నారు. నేరస్తులు ప్రవర్తన మార్చుకుని జనజీవన ప్రవంతిలో కలిసిపోయి గౌరవప్రదంగా జీవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సత్యప్రసాద్, వెంకట్రావు, గుణదల పోలీసులు పాల్గొన్నారు.